ఉద్యమానికి ఊపిరి



- సిద్దిపేట నుంచే మలిదశ పోరాటం
- 2001లో టీఆర్ఎస్ పార్టీ ఏర్పాటు
- సబ్బండ వర్గాల సంకల్ప దీక్షలు
- తెలంగాణ రాష్ట్రం సాకారమై పదేళ్లు
- దశాబ్ది వేడులకు సిద్ధమైన జిల్లా



ముస్తాబైన సిద్దిపేట కలెక్టరేట్

ఆంధ్రజ్యోతి ప్రతినిధి, సిద్దిపేట, జూన్ 1: "సిద్దిపేట లేనిదే కేసీఆర్ లేడు.. కేసీఆర్ లేనిదే తెలంగాణ లేదు".. అని బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం పదేపదే ప్రస్తావిస్తుంటారు. సిద్దిపేట ఎమ్మెల్యేగా ఉన్న కేసీఆర్ 2001లో టీఆర్ఎస్ పార్టీని స్థాపించడంతో ఈ ప్రాంత ఉనికి నలుదిశలా వ్యాపించింది. ఇదే పార్టీ నుంచి తొలిసారి ఎమ్మెల్యేగా కేసీఆర్ పోటీచేసిన నాడు తెలుగు ప్రజలంతా ఉత్కంఠతో ఎదురుచూశారు. ఆ ఉప ఎన్నిక నుంచి తెలంగాణ సాకారమయ్యేవరకు, అలాగే సిద్దిపేట సహా ఉమ్మడి జిల్లా ప్రజలు క్రియాశీలక పాత్ర పోషించారు. పోరాటాలకు పిలుపునిచ్చిన ప్రతీసారి ఊపిరిలూది జైకొట్టారు. కేసీఆర్ వెన్నంటే ఉంటూ ఉద్యమాన్ని హోరెత్తించిన హరీశ్‌రావు సైతం సిద్దిపేట పోరుబాటలో ముందునిలిచారు. ఆటపాటలతో కవి గాయకులు ధూందాం చాటారు. అన్ని వర్గాల ప్రజలు దీక్షాదక్షతతో నినదించారు. స్వరాష్ట్రం ఏర్పాటై నేటికి సరిగ్గా పదేళ్లు నిండిన సందర్భంగా ఉద్యమ సంగతులను మననం చేసుకుంటున్నారు.

కరువుకాటకాలు, ఆకలిచావులు, ఆత్మహత్యలు, వలసలకు ఈ ప్రాంతం పెట్టింది పేరుగా ఉండేది. సాగునీటికి, తాగునీటికి వర్షమే ఆధారమైన పరిస్థితులు. రవాణా వ్యవస్థ, విద్యావైద్యం, ఉపాధిలోనూ వెనుకబాటే. ఇలా ఎన్నో సమస్యలతో తల్లడిల్లిన ఈ ప్రాంతం నాడు ఉద్యమంలో.. ఆ తర్వాత అభివృద్ధిలోనూ ప్రత్యేక గుర్తింపు సాధించింది. ఈ ప్రాంతవాసులుగా పదేళ్ల పాటు ప్రభుత్వంలో కీలకంగా ఉన్న కేసీఆర్, హరీశ్‌రావు తమ పురిటిగడ్డకు ప్రాధాన్యతనిచ్చారు.

> మలివిడత తెలంగాణ ఉద్యమానికి దశ, దిశను చూపిన నేల ఉమ్మడి మెదక్ జిల్లా అంటే అతిశయోక్తి కాదు.. తెలంగాణ ఉద్యమంలో ఉమ్మడి మెదక్ జిల్లా కీలకపాత్ర పోషించింది.
> మలిదశ ఉద్యమంలో జరిపిన పోరాటంలో తెలంగాణ కోసం ఊరువాడ ఒక్కటై కదిలింది. ఆందోళనలతో హోరెత్తించింది.

సిద్దిపేట.. పోరుబాట

2001లో సిద్దిపేట ఎమ్మెల్యేగా ఉన్న కేసీఆర్ తన పదవికి రాజీనామా చేసి టీఆర్ఎస్ పార్టీని స్థాపించడం రాష్ట్ర రాజకీయాల్లోనే సంచలనమైంది. ఆనాడు జరిగిన ఉప ఎన్నికలో సిద్దిపేట పేరు దేశమంతా మార్మోగింది. ఆ తర్వాత 2004 ఉప ఎన్నిక, 2008 ఉప ఎన్నిక, 2009, 2010 ఉప ఎన్నికలో హరీశ్‌రావుకు సిద్దిపేట ప్రజలు భారీ మెజారిటీ అందించి టీఆర్ఎస్ పార్టీని విజయతీరాలకు చేర్చారు. ఇక్కడ జరిగిన ఉద్యోగ గర్జనతో మరోసారి ఉద్యమం వేడెక్కింది. 2009లో సిద్దిపేటలోని అమరుల స్థూపం వద్ద కేసీఆర్ తలపెట్టిన ఆమరణ నిరాహారదీక్షను పోలీసులు భగ్నం చేయడంతో రాష్ట్రం అగ్నిగుండమైంది. ఆయన జైలులో, ఆసుపత్రిలో తన దీక్షను కొనసాగించడంతో డిసెంబరు 9న స్వరాష్ట్ర ప్రకటన వెల్లడైంది. సిద్దిపేట బస్టాండ్ ఆవరణలో 1500 రోజులపైన నిరాహారదీక్షలు చేపట్టారు. అన్నివర్గాల ప్రజలు, మహిళలు, యువత ఈ దీక్షల్లో పాల్గొని ఉద్యమానికి మద్దతు పలికారు.



నారాయణఖేడ్‌కు చెందిన లీఫ్ ఆర్టిస్టు గుండు శివకుమార్ తెలంగాణ దశాబ్ది ఉత్సవాలను పురస్కరించుకొని రావి ఆకుపై గీసిన రాష్ట్ర మ్యాప్, అమరవీరుల స్థూపం, పిడికిలి

ధూందాంకు ఆజ్యం

తెలంగాణ ధూందాం కార్యక్రమానికి ఆజ్యం పోసిన గడ్డ సిద్దిపేటనే. నలువైపులా ప్రజలను జాగృతం చేయడానికి ఊరూరా కళాకారులు తమ ఆటాపాటలతో ఆలోచింపజేశారు. దీనికి పాటలు రచించిన నందిని సిధారెడ్డి ఈ ప్రాంతం వారే. అలాగే ధూందాంకు నాయకత్వం వహించిన రసమయి బాలకిషన్ సిద్దిపేట రూరల్ మండలం రావురూకుల గ్రామస్థుడు. అదే విధంగా తన మాట, పాటతో యావత తెలంగాణ ప్రజల్లో చైతన్యాన్ని రగిల్చిన దేశపతి శ్రీనివాస్ సిద్దిపేట వాస్తవ్యులే. కేసీఆర్ పార్టీని స్థాపించిన క్షణం నుంచి తెలంగాణ వచ్చేదాకా తమ సాహిత్యం, గానంతో ఈ ప్రాంత కళాకారులు వెన్నంటే నిలిచారు. ఉద్యమ పాటలను ప్రజల్లోకి చొచ్చుకెళ్లేలా అహర్నిశలు శ్రమించారు. మంజీర రచయితల సంఘం ఆధ్వర్యంలోనూ అనేక కార్యక్రమాలు జరిగాయి.



సిద్దిపేట సమీకృత జిల్లా కార్యాలయంలో ఏర్పాట్లు చేస్తున్న సిబ్బంది



వేడుకలకు సంబంధించి ఏర్పాటు చేసిన బోర్డు

అమరుల యాదిలో..

5 లో..

యాప్‌పై క్లిక్..
రూ.30వేలు మాయం

- వాట్సాప్‌లో లింకు పంపి మోసం
- రూ.5వేల చొప్పున 6 సార్లు నగదు డెబిట్..

దౌల్తాబాద్, జూన్ 1 : ఓ యువకుడు తన వాట్సాప్‌కు వచ్చిన ఏపీకే యాప్ క్లిక్ చేసి రూ.30 వేలు పోగొట్టుకున్న సంఘటన శనివారం ఆలస్యంగా వెలుగుచూసింది. యువకుడు తెలిపిన వివరాల ప్రకారం.. దీపాయంపల్లి గ్రామానికి చెందిన యువకుడి మొబైల్‌కు మే 30న వాట్సాప్ గ్రూప్‌లో ఏపీకే యాప్ వచ్చింది. ఆ యాప్‌పై క్లిక్ చేశాడు. సదరు యువకుడి యూనియన్ బ్యాంక్ ఖాతాలో ఉన్న రూ.63 వేలలో రూ.5వేల చొప్పున మొత్తం రూ.30వేలు ఆరుసార్లు డెబిట్ అయ్యాయి. శనివారం ఆతను యూనియన్ బ్యాంకులో ఫిర్యాదు చేయడంతో విషయం వెలుగులోకి వచ్చింది. వాట్సాప్, ఇతర ఖాతాల్లో వచ్చే యాప్‌లపై క్లిక్ చేయకూడదని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని బ్యాంకు మేనేజర్ సూచించారు.

వైభవంగా హనుమాన్ జయంతి



రంగధాంపల్లి హనుమాన్ ఆలయంలో మాల విరమణ చేస్తున్న హనుమాన్ దీక్షాదారులు

జిల్లా కేంద్రంలో శనివారం హనుమాన్ జయంతి వేడుకలను అంగరంగ వైభవంగా నిర్వహించారు. పలు ఆలయాల్లో వేకువజామున నుంచే స్వామివారికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. మండల, అర్ధమండల, ఏకాదశ మాలలు వేసిన హనుమాన్ దీక్షాదారులు మాలవిరమణ చేశారు. పలు ఆలయాల్లో అన్నదాన ప్రసాద వితరణ కార్యక్రమం చేపట్టారు.

- సిద్దిపేట జిల్లా స్టాఫ్ ఫొటోగ్రాఫర్

నిర్వాసితుల సమస్యలు పరిష్కరిస్తాం

- మంత్రి దామోదర్ రాజనర్సింహ

ములుగు, జూన్ 1 : కొండపోచమ్మ నిర్వాసితుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ పేర్కొన్నారు. శనివారం కాంగ్రెస్ సీనియర్ నాయకులు ఎడ్ల పోశయ్య ఆధ్వర్యంలో మంత్రి నివాసంలో కలిసి తమ గోడును వెల్లబోసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి దామోదర్ రాజనర్సింహ మాట్లాడుతూ.. గత ప్రభుత్వంలో మీకు జరిగిన అన్యాయం చిన్నది కాదని, మీకు రావాల్సిన ప్యాకేజీలు ప్రభుత్వం నుంచి విడుదల చేసే విధంగా కృషి చేస్తానని ఆయన చెప్పారు. ఎవరు కూడా అధైర్యపడకూడదని, కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నది సీఎం రేవంత్‌తో మాట్లాడి రావాల్సిన ప్యాకేజీ అందజేస్తామని హామీ ఇచ్చారు. మంత్రిని కలిసిన వారిలో బాబు, నర్సింహులు, కిష్టయ్య, నిర్వాసితులు పాల్గొన్నారు.



మంత్రి రాజనర్సింహను కలిసిన నిర్వాసితులు

మెదక్ దక్..దక్

విజయంపై ముగ్గురు అభ్యర్థుల ధీమా

- ఆసక్తిని రేపుతున్న మెతుకుసీమ లోక్‌సభ ఎన్నిక
- అంతుపట్టని పోలింగ్ సరళి
- మెదక్ విజేతపై తెలుగు రాష్ట్రాల్లో బెట్టింగ్
- రసవత్తరంగా ఎగ్జిట్ పోల్స్
- ఎల్లుండి ఫలితాలకు ఎదురుచూపులు



నీలం మధు | వెంకట్రామారెడ్డి | రఘునందన్‌రావు

ఆంధ్రజ్యోతి ప్రతినిధి, సిద్దిపేట, జూన్ 1: మెదక్ లోక్‌సభ పరిధిలో 44 మంది అభ్యర్థులు బరిలో నిలిచారు. అయితే ప్రధానంగా కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ మధ్యనే పోటీ నెలకొన్నది. నెలరోజుల పాటు సాగిన ప్రచార పర్వంలోనూ నువ్వా నేనా అన్నట్లుగా తలపడ్డారు. ఆయా పార్టీల అధినేతలు సైతం తమ అభ్యర్థులకు మద్దతుగా బహిరంగ సభలు, రోడ్‌షోలు నిర్వహించారు. దీంతో ఈ ఎన్నిక రసవత్తరంగా మారింది. గెలిచేదెవరో అనే ఉత్కంఠ ఎక్కువైంది. ఈనెల 4న ఫలితాలు వెల్లడవుతున్నప్పటికీ అంతా కూడా ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

> 'ఆరు గ్యారంటీల అమలు, బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలపై వ్యతిరేకతతో తమ అభ్యర్థి నీలం మధు గెలుపు ఖాయమైంది. మహిళలంతా తమకే ఓట్లు వేశారు' అని కాంగ్రెస్ శిబిరంలో ధీమా కనిపిస్తోంది.
>
> 'కేంద్రంలో నరేంద్ర మోదీ పాలన, అయోధ్య రామమందిర నిర్మాణం, హిందుత్వ నినాదాలతోపాటు ప్రశ్నించే గొంతుకగా తమ అభ్యర్థి రఘునందన్ రావుకే విజయం దక్కుతుంది' అంటూ బీజేపీ శ్రేణులు మనోధైర్యంతో ఉన్నారు.
>
> 'బీఆర్ఎస్‌కు కంచుకోట, కేసీఆర్, హరీశ్ రావులపై విశ్వాసం, ఉద్యమానికి ఊపిరి పోసిన నేల, పదేళ్లలో జరిగిన అభివృద్ధి. రూ.100 కోట్ల విద్యానిధి హామీ అంశాలతో వెంకట్రామారెడ్డికి భారీ మెజార్టీ సాధ్యం కాబోతుంది' అని గులాబీ పార్టీ కార్యకర్తలు ధీమాతో ఉన్నారు.

బీఆర్ఎస్‌కు అత్యంత కీలకం..

గత 5 ఎన్నికల్లోనూ విజయం సాధించి తమ కంచుకోటగా మార్చుకున్న బీఆర్ఎస్ పార్టీకి ఈ ఎన్నిక అత్యంత కీలకంగా మారింది. రాష్ట్రంలో అధికారం కోల్పోవడంతో సాధ్యమైనన్ని ఎంపీ స్థానాలు దక్కించుకుని ఉనికిని చాటుకోవడానికి బీఆర్ఎస్ సంసిద్ధమైంది. తన ఆరోగ్యం సహకరించకున్నా ఆ పార్టీ అధినేత కేసీఆర్ రోడ్‌షోలు చేపట్టారు. మెదక్ లోక్‌సభ పరిధిలోనే అత్యధికంగా ఐదు సభల్లో కేసీఆర్ పాల్గొన్నారు. వెంకట్రామారెడ్డి అభ్యర్థిత్వాన్ని ఖరారు చేసేనాటి నుంచి ఎన్నికయ్యేదాకా మాజీ మంత్రి హరీశ్‌రావు అన్నీతానై ప్రచారం చేశారు. వెంకట్రామారెడ్డి సైతం రూ. 100 కోట్ల విద్యానిధితోపాటు అనేక సంక్షేమ కార్యక్రమాలను తన సొంత నిధులతో అమలు చేస్తానని హామీ ఇచ్చారు.

కాంగ్రెస్‌కూ ప్రతిష్ఠాత్మకమే..

రాష్ట్రంలో అధికారం చేపట్టిన కాంగ్రెస్ పార్టీ కూడా మెదక్ ఎన్నికను ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నది.1980లో ఇందిరాగాంధీ ఇదే సెగ్మెంటు నుంచి ఎంపీగా విజయం సాధించి ప్రధాని సీట్లో కూర్చున్నారు. మెదక్ ఎంపీగా ఉన్నప్పుడే ఆమె హత్యకు గురయ్యారు. ఇక్కడ 19 సార్లు ఎన్నిక జరిగితే అందులో సగానికి పైగా కాంగ్రెస్ అభ్యర్థులే గెలిచారు. అందుకే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రత్యేక దృష్టిసారించి ముదిరాజ్ కులస్థుడైన నీలం మధును బరిలో దింపారు. మెదక్, పటాన్‌చెరు, సిద్దిపేటలో తాను, నర్సాపూర్‌లో రాహుల్‌గాంధీ సభలు, రోడ్‌షోలు నిర్వహించారు. ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి, మంత్రి కొండా సురేఖ సైతం విస్తృతంగా ప్రచారం చేపట్టారు. ఈ స్థానాన్ని ఎలాగైనా తమ ఖాతాలో వేసుకోవాలని తీవ్రంగా ప్రయత్నించారు.

బీజేపీ ప్రత్యేక దృష్టి..

గత పార్లమెంటు ఎన్నికలతో పోలిస్తే ఈసారి బీజేపీ మెదక్ సీటుపై గురిపెట్టిందనే చెప్పాలి. గత ఎన్నికల్లో పోటీచేసిన అనుభవం ఉన్న మాజీ ఎమ్మెల్యే రఘునందన్ రావుకే మరోసారి అవకాశం ఇచ్చారు. ఆయన నామినేషన్ కార్యక్రమానికి గోవా సీఎం ప్రమోద్ సావంత హాజరయ్యారు. సిద్దిపేటలో జరిగిన విశాల జనసభకు ఆ పార్టీ అగ్రనేత అమిత్‌షా వచ్చారు. మెదక్ జిల్లా అల్లాదుర్గంలో జరిగిన బహిరంగ సభలో మోదీ పాల్గొన్నారు. ఆర్ఎస్ఎస్, బీజేపీ అనుబంధ విభాగాలు క్షేత్రస్థాయిలో కృషిచేశాయి. దీనికితోడు రఘునందన్‌రావు తన వాగ్ధాటితో కాంగ్రెస్, బీఆర్ఎస్ అభ్యర్థులపై విమర్శలు ఎక్కుపెట్టారు. దుబ్బాక ఎమ్మెల్యేగా ఓటమిపాలైన తాను చావోరేవో అన్నట్లుగా విజయం కోసం శ్రమించారు.

బెట్టింగ్‌ల జోరు

తెలుగు రాష్ట్రాల్లో 42 ఎంపీ స్థానాలున్నాయి. తాజా ఎన్నికల్లో హాట్‌స్థానాల జాబితాలో మెదక్ ముందువరుసలో నిలిచింది. పదేళ్లపాటు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ పార్టీ గెలిచేస్థానాల్లో తొలిప్రాధాన్యతగా మెదక్ పేరే చెబుతున్నారు. ఇక్కడ గెలవకుంటే ఇంకెక్కడ కూడా గెలిచే పరిస్థితి లేదంటున్నారు. ఇక దుబ్బాక ఉపఎన్నికలో ఎమ్మెల్యేగా గెలిచి సంచలనం సృష్టించిన రఘునందన్‌రావుకూ మెదక్‌లో విజయావకాశాలు పుష్కలంగా ఉన్నాయని పలువురు విశ్లేషిస్తున్నారు. ఇక బీఆర్ఎస్, బీజేపీ అభ్యర్థులిద్దరూ అగ్రకులాలవారు కావడం, కాంగ్రెస్ అభ్యర్థి నీలం మధు బీసీ సామాజికవర్గం, అందులోనూ అత్యధిక ఓట్లున్న ముదిరాజ్ కులానికి చెందినవారు కావడంతో అంచనాలు నెలకొన్నాయి. దీనికితోడు కాంగ్రెస్ పార్టీ ప్రత్యేక దృష్టి సారించి విజయం కోసం సర్వశక్తులు ఒడ్డారు. మెదక్ పార్లమెంటు పరిధిలో, తెలంగాణతోపాటు ఏపీలోనూ ఈ సీటు గురించి విస్తృతంగా చర్చిస్తున్నారు. ఇక్కడి గెలుపోటములపై బెట్టింగ్‌లు పెడుతున్నారు. ఏపీకి చెందిన వారు స్థానికులకు ఫోన్లు చేసి విజయావకాశాలపై ఆరాతీస్తున్నారు.

రసవత్తరంగా ఎగ్జిట్ పోల్స్

శనివారం సాయంత్రం పలు సర్వే సంస్థలు వెల్లడించిన ఎగ్జిట్ పోల్స్ ఫలితాలు మరింత ఉత్కంఠను రేపుతున్నాయి. తెలంగాణలో బీఆర్ఎస్ ఒకే ఒక్కస్థానం విజయం సాధిస్తుందని వెల్లడించాయి. అక్కడ మెదక్ లోక్‌సభ గురించే ప్రస్తావించాయి. ఇక మరికొన్ని ఏజెన్సీలు మాత్రం పోలింగ్ సరళి ఆధారంగా బీజేపీకే విజయావకాశాలు ఉన్నాయని స్పష్టం చేస్తున్నాయి. ఒకట్రెండు ఏజెన్సీలు కాంగ్రెస్ కూడా గెలవొచ్చని తమ అభిప్రాయాలను వ్యక్తపరిచాయి. ఇప్పటికే రసవత్తరంగా ఉన్న మెదక్ ఫలితాన్ని తాజా ఎగ్జిట్ పోల్స్ ఊపిరి బిగపట్టేలా చేశాయి.

6 నుంచి సహకార సంఘాల ఎన్నికలు

సంగారెడ్డి రూరల్/మెదక్ అర్బన్, జూన్ 1 : రాష్ట్ర సహకార ఎన్నికల అథారిటీ ఆదేశాల మేరకు ఈనెల 6 నుంచి 28 లోపు జిల్లాల్లోని సహకార సంఘాల ఎన్నికలు నిర్వహించనున్నట్లు అధికారులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మెదక్ జిల్లాలోని 68 ప్రాథమిక మత్స్య సహకార సంఘాలకు, ఒక గొర్రెల, ఒక కల్లుగీతా సహకార సంఘానికి ఎన్నికలు జరగనున్నట్లు జిల్లా సహకార సంఘాల అధికారిణి కరుణ పేర్కొన్నారు. సంగారెడ్డి జిల్లాలో ఒక హౌసింగ్, ఒక ఎల్‌సీసీఎస్‌కు ఎన్నికలను నిర్వహించనున్నట్లు జిల్లా సహకార అధికారి శ్రీధర్ తెలిపారు. మొత్తం రెండు సంఘాల ప్రతిపాదనలు వచ్చాయని ఎన్నికల షెడ్యూల్ ప్రకారం 28లోపు నిర్వహించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. వివిధ సహకార సంఘాల అధ్యక్ష, కార్యదర్శులు, పాలకవర్గ సభ్యులు వారి పదవీ కాలం ముగిసే గడువుకు ముందు రెండు నెలల్లోగా ఎన్నికల ప్రతిపాదనలు నిర్ణీత ఫార్మెట్‌లో సభ్యుల ఫొటోలతో పాటు, ఎన్నికల ఫీజు డీడీ రూపంలో తీసి తమ కార్యాలయానికి పంపాలని సూచించారు.

కాంగ్రెస్ సర్కారు ఏర్పడ్డాకే..
తెలంగాణ రాష్ట్రం వచ్చినట్లు ఉంది

- గడచిన దశాబ్దం.. ఓ విషాదం: హరగోపాల్
- గత సర్కారు సాగును పట్టించుకోలేదు: కోదండరాం

రాజేంద్రనగర్, జూన్ 1(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాతనే తెలంగాణ రాష్ట్రం వచ్చినట్లు అనిపిస్తోందని ప్రొఫెసర్ హరగోపాల్ అన్నారు. రాష్ట్రంలో గత దశాబ్దం ఒక విషాదంగా మిగిలిపోయిందన్నారు. ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం(పీజేటీఎస్ఏయూ) తెలంగాణ వ్యవసాయ శాస్త్రవేత్తల సంఘం(టాసా), వర్సిటీ బోధనేతర సిబ్బంది సంఘం ఆధ్వర్యంలో శనివారం రాజేంద్రనగర్ వ్యవసాయ కళాశాల ఆడిటోరియంలో తెలంగాణ దశాబ్ది ఉత్సవాలను నిర్వహించారు. ముఖ్య అతిథిగా హరగోపాల్ మాట్లాడారు. ఈ ప్రభుత్వం విశ్వవిద్యాలయాలకు నిధులు కేటాయించాలన్నారు. ప్రభుత్వ కార్యదర్శులకు విశ్వవిద్యాలయాల బాధ్యతలను అప్పగిస్తే వారేం చేయగలుగుతారని ప్రశ్నించారు. వ్యవసాయ పరంగా తెలంగాణ అభివృద్ధికి ఎన్నో అవకాశాలున్నా గత ప్రభుత్వాలు ఆ దిశగా కృషి చేయలేదని ప్రొఫెసర్ కోదండరాం విమర్శించారు. తెలంగాణకు విత్తన భాండాగారం అనే పేరున్నప్పటికీ సన్న, చిన్న కారు రైతులకు మేలు చేసేలా గత ప్రభుత్వం చర్యలు చేపట్టలేదన్నారు. ప్రస్తుత ప్రభుత్వం చర్యలు, సంప్రదింపులకు తలుపులు తెరవడం హర్షణీయమని అన్నారు.

ఆ పట్టణాల పేర్లు కూడా మార్చాలి

- బీజేఎల్పీ నేత మహేశ్వర్‌రెడ్డి డిమాండ్

హైదరాబాద్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): రాచరికపు ఆనవాళ్లు ఉన్నాయంటూ రాష్ట్ర ప్రభుత్వ లోగోను మార్చిన రేవంత్ సర్కార్ అవే ఆనవాళ్లతో కొనసాగుతున్న కొన్ని పట్టణాలు, జిల్లాల పేర్లు కూడా మార్చాలని బీజేపీ శాసనసభాపక్షనేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి డిమాండ్ చేశారు. బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. ఆదిలాబాద్ పేరును ఎదులాపురంగా, నిజామాబాద్‌ను ఇందూరుగా, జహీరాబాద్‌ను పెద్దెక్కిలిగా, కరీంనగర్‌ను ఎలగందలగా, సికింద్రాబాద్‌ను లష్కర్ లేదా ఉల్వులుగా, మహబూబ్‌నగర్‌ను పాలమూరుగా, మహబూబాబాద్ పేరును మానుకోటగా మార్చి తెలంగాణ సంస్కృతిక పునరుజ్జీవనానికి బాటలు వేయాలని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం రూపొందించిన కొత్త లోగోలో అమరవీరుల స్థూపం పెట్టడాన్ని స్వాగతిస్తున్నట్లు చెప్పారు. తెలంగాణ తొలి, మలి దశ ఉద్యమాలలో ప్రాణాలర్పించిన వారి కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగంతో పాటు, వారి తల్లి, తండ్రి లేదా భార్యకు ప్రతినెలా రూ. 25 వేల అమరవీరుల గౌరవ పెన్షన్, ఇళ్ల స్థలాలు అందజేస్తామన్న హామీని అమలు చేయాలని డిమాండ్ చేశారు.

నాగేంద్రరావు పదవీ కాలాన్ని పొడిగించొద్దు

- నల్ల బ్యాడ్జీలతో నీటి పారుదల ఉద్యోగుల నిరసన

హైదరాబాద్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): నీటి పారుదల శాఖ ఈఎన్‌సీ(ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్, క్వాలిటీ కంట్రోల్) బి.నాగేంద్రరావు పదవీ కాలాన్ని ఆర్నెళ్ల పాటు పొడిగిస్తూ వెలువరించిన ఉత్తర్వులను వెంటనే వెనక్కి తీసుకోవాలని ఆ శాఖ ఉద్యోగులు, అధికారులు నిరసన తెలిపారు. శనివారం వీరంతా నల్లబ్యాడ్జీలు ధరించి విధులకు హాజరయ్యారు. పదవీ విరమణ చేసిన వారిని సలహాదారులుగా, ఓఎస్డీలుగా నియమించుకుంటే తమకెలాంటి అభ్యంతరం లేదని.. కేడర్ పోస్టుల్లో నియమించడం వల్ల సర్వీసులో ఉన్న ఉద్యోగులకు అన్యాయం జరుగుతుందని, పదోన్నతుల ప్రక్రియకు విఘాతం కలుగుతుందని ఉద్యోగులు మండిపడ్డారు. ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ సీఎంవో ఈ మెయిల్‌కు వినతి పత్రాలను పంపించారు. ఈ నెల 7 నుంచి ఈఎన్‌సీ సర్వీసు పొడిగింపుపై నిరసనలు ముమ్మరం చేయాలని సంఘాలు నిర్ణయించాయి. మరోవైపు పదవీ విరమణ చేసిన వారి సర్వీసును పొడిగిస్తూ తీసుకున్న నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని హైదరాబాద్ ఇంజనీర్స్ అసోసియేషన్ ప్రభుత్వాన్ని కోరింది. ఈ మేరకు సంఘం అధ్యక్ష, కార్యదర్శులు సత్యనారాయణరెడ్డి, చక్రధర్, వర్కింగ్ ప్రెసిడెంట్ రవీందర్‌లు సీఎంకు వినతి పత్రం అందించారు.

ఏసీబీ దర్యాప్తు.. మరింత లోతుగా!

గొర్రెల డబ్బులు పంచుకున్నది అధికారులు, ప్రైవేటు వ్యక్తులేనా? రాజకీయ నేతల ప్రమేయం ఉందా?

- 700కోట్ల అక్రమాలపై త్వరలో నివేదిక
- రాంచందర్, కల్యాణ్ కస్టడీకి కోర్టులో పిటిషన్ వేయాలని ఏసీబీ యోచన

హైదరాబాద్, జూన్ 1(ఆంధ్రజ్యోతి): గొర్రెల పంపిణీ పథకంలో భారీగా అక్రమాలు జరిగిన విషయం వెలుగులోకి వస్తుండడంతో.. దీనిపై మరింత లోతుగా దర్యాప్తు జరపాలని అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) భావిస్తోంది. సుమారు రూ.4 వేల కోట్లు ఖర్చు చేసిన ఈ పథకంలో ప్రాథమిక దర్యాప్తులోనే రూ.700కోట్ల అక్రమాలు జరిగినట్లు తేలడంతో.. లోతుగా దర్యాప్తు జరిపితే మరిన్ని అక్రమాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉందని యోచిస్తోంది. ఈ మేరకు ఇప్పటివరకు జరిపిన దర్యాప్తు, ఎవరెవరి ప్రమేయం ఎంతవరకు ఉంది అనే వివరాలతో ప్రభుత్వానికి త్వరలో ప్రాథమిక నివేదిక అందజేసి.. తదుపరి దర్యాప్తునకు అనుమతి కోరనుంది. గత బీఆర్ఎస్ ప్రభుత్వం 2015లో గొర్రెల పంపిణీ పథకాన్ని ప్రారంభించి వేలాది మంది లబ్ధిదారులకు జీవాలను పంపిణీ చేసిన విషయం తెలిసిందే. అయితే గొర్రెల పంపిణీకి సంబంధించిన బిల్లుల చెల్లింపులో అక్రమాలు జరిగాయంటూ ఆంధ్రప్రదేశ్ రైతులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు గచ్చిబౌలి పోలీసులు తొలుత కేసు నమోదు చేశారు. ఆ తరువాత ప్రభుత్వ ఆదేశం మేరకు ఏసీబీ రంగంలోకి దిగింది. అయితే రూ.2.10 కోట్ల అక్రమాలు జరిగాయన్న ఆరోపణలపై ఏసీబీ దర్యాప్తు చేపట్టగా.. ఏకంగా రూ.700కోట్ల అక్రమాలు జరిగినట్లు తేలింది. ప్రైవేటు వ్యక్తులు, దళారులు, ప్రభుత్వ ఉద్యోగుల అరెస్టుతో మొదలై మాజీ మంత్రి ఓఎస్డీ, టీఎస్ఎల్‌డీఏ సీఈవోను అరెస్టు చేసేదాకా వెళ్లింది. ఈ కేసులో ఇప్పటివరకు మొత్తం 12 మంది అరెస్ట్ కాగా.. శుక్రవారం అరెస్టయిన తెలంగాణ స్టేట్ లైవ్ స్టాక్ డెవలప్‌మెంట్ ఏజెన్సీ సీఈవో సబావత్ రాంచందర్, మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ మాజీ ఓఎస్డీ జి.కల్యాణ్‌కుమార్‌లు కీలకంగా వ్యవహరించినట్లు ఏసీబీ భావిస్తోంది. వీరిని ప్రశ్నిస్తే మరిన్ని అక్రమాలు, మరికొందరి పేర్లు బయటకు వచ్చే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు. ఇప్పటికే రూ.700 కోట్ల అక్రమాలు జరిగినట్లు తేలడంతో.. పరిమిత అధికారం ఉన్న రాంచందర్, కల్యాణ్‌లే ఇదంతా చేశారా? లేక వారి వెనక ఎవరైనా రాజకీయ నాయకుల ప్రమేయం ఉందా? అనే కోణంలో విచారించాలని యోచిస్తున్నారు. ఇందుకోసం.. ప్రస్తుతం జ్యుడీషియల్ రిమాండ్‌లో ఉన్న వీరిద్దరిని కోర్టు అనుమతితో తమ కస్టడీకి తీసుకునేందుకు ఏసీబీ ప్రత్యేక కోర్టులో వచ్చేవారం పిటిషన్ దాఖలు చేయనున్నట్లు తెలుస్తోంది. ప్రైవేటు వ్యక్తుల్లో మొహిదొద్దీన్, ఆయన కుమారుడిని ప్రశ్నించే అవకాశం ఉన్నట్లు తెలిసింది. పశుసంవర్ధక శాఖలో ఫైళ్ల మాయంపై కూడా ఆరా తీయనున్నట్లు సమాచారం.



కేసుల వివరాల సేకరణ..

గత ప్రభుత్వ హయాంలో జరిగిన గొర్రెల పంపిణీపై అప్పట్లో పలు పోలీస్‌స్టేషన్ల పరిధిలో కేసులు నమోదయ్యాయి. ఒక్కో యూనిట్‌లో నిర్దేశించిన జీవాల కంటే తక్కువగా ఇవ్వడం, ఇచ్చిన వెంటనే ఫొటోలు తీసుకుని వెనక్కి తీసుకెళ్లడం, ఇలా అనేక అక్రమాలపై ఈ కేసులు నమోదయ్యాయి. ఆయా పోలీస్‌స్టేషన్లలో నమోదైన కేసుల వివరాలను ఏసీబీ అధికారులు సేకరించే పనిలో నిమగ్నమయ్యారు. వీటిలో.. హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండలం బావుపేట గ్రామంలో 21 మందికి గొర్రెల యూనిట్లు మంజూరయ్యాయి. వీరిలో 11 మందికి 2021 ఏప్రిల్ 10న ఏపీలోని గుంటూరు జిల్లా మాచర్ల నుంచి 11 యూనిట్ల గొర్రెలు తీసుకొచ్చారు. గొర్రెల కొనుగోలు కోసం ఏపీకి వెళ్లిన అధికారులతో అక్కడి దళారీ ఒకరు రీ- సైక్లింగ్‌కు ముందస్తు ఒప్పందం కుదుర్చుకున్నాడు. బావుపేట శివారులో గొర్రెలను దించి.. ఒక్కో యూనిట్‌కు రూ.72,500 చొప్పున లబ్ధిదారులకు చెల్లించి.. అధికారుల ధ్రువీకరణ అనంతరం తిరిగి అదే వాహనంలో గొర్రెలను ఏపీకి తీసుకెళ్తుండగా హసన్‌పర్తి పోలీసులు అడ్డుకొని కేసు నమోదు చేశారు. ఇక జనగామ జిల్లా బచ్చన్నపేటకు చెందిన గొల్ల కురుమలకు ఏపీలోని ప్రకాశం జిల్లా ఒంగోలు, గుంటూరు జిల్లాలోని పిడుగురాళ్ల, వినుకొండ నుంచి గొర్రెలను తీసుకొచ్చి.. లబ్ధిదారులతో ఫొటోలు దిగి, ఒక్కొక్కరికి రూ.70 వేలు చేతిలో పెట్టి.. అదేరోజు సాయంత్రం గొర్రెలను తిరిగి తీసుకెళ్లారు.

మంత్రి చేతుల మీదుగా పంపిణీ చేసినా..

2021 జనవరి 21న జగిత్యాల జిల్లాలో సాక్షాత్తూ అప్పటి పశుసంవర్ధకశాఖ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ చేతుల మీదుగా లాంఛనంగా పంపిణీ చేసిన యూనిట్లలో కూడా గోల్‌మాల్ జరిగింది. 21 గొర్రెలకు బదులుగా.. 13-16 గొర్రెలు మాత్రమే ఇచ్చి దోకా చేశారు. మొదటి విడతలో అప్పటి ప్రభుత్వం 3.50 లక్షల యూనిట్లు పంపిణీ చేయగా... అత్యధిక యూనిట్ల పంపిణీలో ఇదే తరహాలో దందా జరిగింది. ఈ గొర్రెల దందాలో కొందరు ఎమ్మెల్యేలు, మంత్రులు, రాష్ట్ర పశుసంవర్ధకశాఖ అధికారులు, కాంట్రాక్టర్లు, బ్రోకర్లు... భాగస్వాములైనట్లు ఆరోపణలు ఉన్నాయి. రాష్ట్రంలోని గొల్ల కురుమలకు రూ.75 వేలు చేతిలో పెట్టి.. యూనిట్లు కాజేసిన సంఘటనలు, గొర్రెలతో లబ్ధిదారుల ఫొటోలు తీయించి, వాహనాల్లో తీసుకెళ్లి, రైతులతో అగ్రిమెంటు చేసుకొని, మళ్లీ అవే వాహనాల్లో తిరిగి జీవాలను తీసుకెళ్లిన ఉదంతాలు కోకొల్లలుగా జరిగాయి. 20 గొర్రెలు, ఒక పొట్టేలుకు బదులుగా... చిన్న పిల్లలు, నాణ్యతలేని గొర్రెలు, రోగాల బారిన పడిన జీవాలను కూడా రైతులకు అంటగట్టారు. గొర్రెల రీ- సైక్లింగ్ అక్రమ రవాణాపై అప్పట్లో కేసులు కూడా నమోదయ్యాయి. రాష్ట్ర పశుసంవర్ధక శాఖకు చెందిన 24 మంది అధికారులపై శాఖాపరమైన చర్యలు తీసుకున్నారు. కొందరు అధికారులను సస్పెండ్ చేశారు. మరికొందరిని ప్రొక్యూర్మెంట్ బాధ్యతల నుంచి తప్పించారు. అప్పుడు జరిగిన అక్రమాలన్నింటిపైనా ఇప్పుడు ఏసీబీ అధికారులు పూర్తి ఆధారాలతో దర్యాప్తు జరుపుతున్నారు.

విధులకు ఆటంకం కలిగించిన వారిపై ఫిర్యాదు..

రూ.వందల కోట్ల అక్రమాల కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న రాంచందర్‌ను ఆయన కార్యాలయంలో ఏసీబీ అధికారులు అదుపులోకి తీసుకునేందుకు వెళ్లిన సమయంలో హైడ్రామా చోటు చేసుకుంది. శుక్రవారం తన కార్యాలయానికి వచ్చిన ఏసీబీ అధికారులకు సహకరించేందుకు రాంచందర్ నిరాకరించారు. చివరికి తమ వద్ద ఉన్న ఆధారాలను చూపించడంతో తప్పనిసరి పరిస్థితుల్లో ఏసీబీ అధికారుల వెంట బయలుదేరారు. అయితే అదే సమయంలో కొందరు సిబ్బంది రాంచందర్‌కు అనుకూలంగా వ్యవహరిస్తూ ఏసీబీ అధికారుల విధులకు ఆటంకం కలిగించారు. దీంతో వారిపై పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు ఏసీబీ అధికారులు సిద్ధమవుతున్నారు. అత్యంత కీలకమైన కేసు కావడంతో ఎక్కడ, ఏ చిన్న తప్పిదానికి ఆస్కారం లేకుండా, ప్రతిదీ పక్కాగా, చట్టప్రకారం ముందుకెళ్లాలని దర్యాప్తు అధికారులు నిర్ణయించారు. భవిష్యత్తులో మరిన్ని అరెస్టులు జరిగే అవకాశం ఉన్నందున.. ఈ తరహా ఇబ్బందులకు ఆస్కారం లేకుండా కూడా ఈ ఫిర్యాదు ఉపయోగపడుతుందని వారు భావిస్తున్నారు.

మమ్మల్నెందుకు పిలవలేదు!

- సీఎం రేవంత్‌కు బండి సంజయ్ ప్రశ్న
- ట్యాంపింగ్ వివాదంపై సీబీఐ విచారణ కోరాలంటూ సీఎంకు లేఖ



న్యూఢిల్లీ, హైదరాబాద్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర అవతరణ వేడుకల కోసం కాంగ్రెస్ అగ్ర నేత సోనియా గాంధీని ఆహ్వానించిన సీఎం రేవంత్ రెడ్డి.. రాష్ట్రం ఏర్పాటులో కీలకపాత్ర పోషించిన బీజేపీ నేతలను ఎందుకు ఆహ్వానించలేదో చెప్పాలని ఆ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి ఎంపీ బండి సంజయ్ డిమాండ్ చేశారు. పార్లమెంట్‌లో రాష్ట్ర ఏర్పాటు బిల్లుకు పూర్తిస్థాయిలో మద్దతునిచ్చిన పార్టీ బీజేపీ అని గుర్తు చేశారు. ఢిల్లీలో ఆయన శనివారం మీడియాతో మాట్లాడారు. బిల్లు ఆమోదం పొందే సమయంలో కేసీఆర్ సభలో లేరని, బిల్లుకు ఓటు కూడా వేయలేదని అన్నారు. ఉద్యమ సమయంలో ఆత్మహత్యలను ఆపేందుకు బీజేపీ నేత సుష్మా స్వరాజ్ కృషి చేశారని సంజయ్ చెప్పారు. ఆనాటి ఆత్మహత్యలకు సోనియా, కాంగ్రెస్ పార్టీలే కారణమని ఆరోపించారు. గతంలో రేవంత్ కూడా సోనియాను బలిదేవత అన్నారని గుర్తు చేశారు. కేసీఆర్‌ను ఆహ్వానించడానికి ఉత్సాహం చూపిన రేవంత్ బీజేపీ నేతలను ఎందుకు విస్మరించారని ప్రశ్నించారు. ఎన్నికల ఫలితాల తర్వాత కాంగ్రెస్‌లో బీఆర్ఎస్ విలీనానికి కేసీఆర్ రహస్య ఒప్పందం చేసుకున్నారని ఆరోపించారు. కాగా, ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం తీవ్రత నేపథ్యంలో దానిపై సీబీఐ విచారణ కోరాల్సిన అవసరం ఉందని బండి సంజయ్ స్పష్టం చేశారు. ఈ మేరకు సీఎం రేవంత్‌రెడ్డి స్వయంగా కేంద్రానికి లేఖ రాసి చిత్తశుద్ధి నిరూపించుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కేసుతో తెలంగాణ ప్రతిష్ఠ మసకబారిందని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్రంలోకి సీబీఐ ప్రవేశాన్ని నిషేధిస్తూ గత ప్రభుత్వం ఇచ్చిన జీవోను రద్దు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈమేరకు సంజయ్ శనివారం సీఎం రేవంత్‌కు లేఖ రాశారు. ఫోన్ ట్యాపింగ్‌తో బీఆర్ఎస్ పెద్దలు అధికార పార్టీ సహ ప్రతిపక్ష ప్రజాప్రతినిధుల హక్కులను మంట కలిపారని ఆరోపించారు. ఈ వ్యవహారంలో కేసీఆర్, కేటీఆర్ పాత్ర ఉందని వెలుగు చూసినా కనీసం నోటీసులు ఇవ్వకపోవడాన్ని చూస్తుంటే రాష్ట్ర దర్యాప్తు సంస్థల తీరుపై అనుమానాలు కలుగుతున్నాయన్నారు.

పోలింగ్ సరళిపై బీజేపీ నేతల సమీక్ష

లోక్‌సభ ఎన్నికలపై బీజేపీ ముఖ్యనేతలు పార్టీ రాష్ట్ర కార్యాలయంలో శనివారం సమీక్ష నిర్వహించారు. ఎన్నికల ఇంచార్జి అభయ్ పాటిల్, సంస్థాగత రాష్ట్ర ప్రధానకార్యదర్శి చంద్రశేఖర్, ఎంపీ కె.లక్ష్మణ్, జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ, బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, గరికపాటి మోహన్‌రావు, ఎస్.రాంచందర్‌రావుతో పాటు జిల్లా పార్టీ అధ్యక్షులు, పార్లమెంటు నియోజకవర్గ ఇంచార్జులు, ఎంపీ అభ్యర్థులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఆయా నియోజకవర్గాల్లో పోలింగ్ సరళిపై సమీక్షించారు. అభ్యర్థుల అభిప్రాయాలను, ప్రచారం సందర్భంగా పార్టీ శ్రేణుల పనితీరును అభయ్‌పాటిల్ అడిగి తెలుసుకున్నారు. ఈ నివేదికను జాతీయ నాయకత్వానికి నేడో, రేపో అందించనున్నారని పార్టీ వర్గాలు తెలిపాయి.

అమరుల యాదిలో

తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం సిద్ధించి పదేళ్లవుతున్నది. సంబురాలు అంబరాన్నంటుతున్నాయి. ఆ సంబురాల వెనక అనేక మంది ఆత్మబలిదానాలు, ఉద్యమాలు దాగి ఉన్నాయి. నాడు ఉమ్మడిగా ఉన్న మెదక్ జిల్లా నుంచి తెలంగాణ ఉద్యమంలో వేలమంది కుటుంబాలను వదిలి ఆందోళనల్లో పాల్గొన్నారు. ఎంతోమంది ఆత్మబలిదాలు చేశారు. నేడు తెలంగాణ ఆవిర్భవించిన దినం సందర్భంగా ఉమ్మడి మెదక్ జిల్లాలో తెలంగాణ అమరులను ఓసారి గుర్తు చేసుకుందాం.

భెల్ ఉద్యోగాల్లో అన్యాయంపై లక్ష్మణ్ ఆత్మార్పణ



జహీరాబాద్/పటాన్‌చెరు/రామచంద్రాపురం: సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ మండలం హోతీ బీ గ్రామానికి చెందిన భద్రన్న, గుండమ్మల మొదటిసంతానం సిరిసిగ లక్ష్మణ్‌యాదవ్(20) ఐటీఐ చేసి కేంద్ర ప్రభుత్వ సంస్థ బీహెచ్ఈఎల్‌లో అప్రెంటీస్ పూర్తి చేశాడు. ఆనాడు బీహెచ్ఈఎల్‌లో ఉద్యోగం కోసం నాలుగుసార్లు రాత పరీక్ష రాసి ఉత్తీర్ణుడయ్యాడు. నాలుగు సార్లు ఇంటర్వ్యూలు జరిగినప్పటికీ సీమాంధ్ర అధికారుల పెత్తనంతో వారికే ప్రాధాన్యమిచ్చారు. ఉద్యోగం రాదని మనస్థాపానికి గురైన లక్ష్మణ్‌యాదవ్ ప్రభుత్వాలను కదిలించేందుకు ఫిబ్రవరి 26, 2010న బెల్ పరిశ్రమ ప్రధాన గేటు ముందు ఉన్న గాంధీ విగ్రహం వద్ద ఒంటిపై పెట్రోల్ పోసుకుని జై తెలంగాణ అని నినదీస్తూ నిప్పంటించుకుని, ఆత్మహత్య చేసుకున్నాడు. ఆత్మహత్యకు ముందు బెల్ ఉద్యోగ నియామకాలలో అవతవకలు, స్థానిక యువతకు జరుగుతున్న అన్యాయంపై లక్ష్మణ్ రాసిన 16పేజీల ఉత్తరం ప్రతి ఒక్కరిని కదిలించింది. దీంతో బెల్ కార్మికులతో పాటు అన్ని పార్టీల నాయకులు జాతీయ రహదారిని దిగ్బంధం చేశారు. బెల్ నియామకాల్లో పూర్తి పారదర్శకత పాటిస్తామని యాజమాన్యం దిగివచ్చి ప్రత్యేకంగా హామీ ఇచ్చింది. తెలంగాణ ప్రభుత్వం లక్ష్మణ్ కుటుంబానికి రూ.పదిలక్షల ఆర్థిక సహాయం, సోదరుడికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించింది. అయితే వారి కుటుంబం ఇంకా పేదరికంలో మగ్గుతూనే ఉన్నది.

మైసమ్మకు మొక్కుకుని బలిదానం



ఇషాంత్‌రెడ్డి

న్యాల్‌కల్: మలిదశ ఉద్యమ సమయంలో సంగారెడ్డి జిల్లా న్యాల్‌కల్ మండలం బసంతాపూర్‌కు చెందిన ఇషాంత్‌రెడ్డి హైదరాబాద్‌లోని ఓయూలో ఉంటూ, వాసవి ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ చేసి ఉన్నత చదువుల కోసం సన్నధమవుతున్నాడు. ఈ క్రమంలోనే తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైతే ఉద్యోగం వస్తుందనే వాదన ఆయనలో బలంగా నాటుకుపోయింది. అప్పటి ఏపీసీసీ అధ్యక్షుడు ఓడిపోతే ఆత్మార్పణ చేసుకుంటానని ఓయూలోని మైసమ్మ తల్లికి మొక్కుకున్నాడు. ఆ మేరకు ఆయన సూసైడ్ నోట్ రాసి, మైసమ్మ ఆలయం వద్ద ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఆయన రాసిన సూసైట్ నోట్‌లో అప్పటి కాంగ్రెస్, టీడీపీ నాయకులు తెలంగాణ ద్రోహులని పేర్కొన్నాడు. ప్రత్యేక తెలంగాణ ఏర్పడిన తర్వాత రాష్ట్ర ప్రభుత్వం ఇషాంత్‌రెడ్డి కుటుంబానికి రూ.10లక్షల ఆర్థిక సాయం చేసింది. సోదరుడికి ఉద్యోగం కల్పించింది. అయితే తమ మరో కుమారుడి చదువుకు సరిపోను ఉద్యోగం ఇవ్వకపోవడంతో అతను చేరలేదని తల్లిదండ్రులు స్వరూప, ఇంద్రసేనారెడ్డి తెలిపారు. ఎలాంటి సహాయానికి నోచుకోని అమరుల కుటుంబాలను ఆదుకోవాలని వారు కోరుతున్నారు.

గిరిజన బిడ్డలైన తండ్రి, కొడుకుల ఆత్మహత్య

నారాయణఖేడ్: తెలంగాణ రాష్ట్ర సాధన కోసం సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ మండలం చాప్టా.కె పరిధిలోని సీతారాంతండాకు చెందిన శ్యామానాయక్ ఆత్మహత్య చేసుకున్నాడు. కుమారుడు లక్ష్మణ్ సైతం తండ్రిబాటలోనే తెలంగాణ సాధన కోసం క్రిమి సంహారక మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. కాగా శ్యామానాయక్‌కు భార్య సోనిబాయి, ఇద్దరు కుమారులు, ఇద్దరు కూతుళ్లు ఉండగా ఒక కుమారుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఇద్దరి కూతుళ్లకు పెళ్లిళ్లయ్యాయి. మరో కుమారుడు హైదరాబాద్‌కు వలస వెళ్లాడు. శ్యామానాయక్ భార్య సోనిబాయి సైతం నారాయణఖేడ్ పట్టణంలో జరిగిన రోడ్డుప్రమాదంలో పదేళ్ల క్రితం మృతి చెందింది. ఆ కుటుంబం పేదరికంలోనే మగ్గుతుంది.

ఉద్యమ అడ్డాగా మాసాన్‌పల్లి చౌరస్తా

కల్హేర్: మలిదశ ఉద్యమంలో సంగారెడ్డి జిల్లాలోని కల్హేర్ మండలం ఎంతో కీలకంగా మారింది. 161వ జాతీయ రహదారిపై ఉన్న మండలంలోని మాసాన్‌పల్లి చౌరస్తా ఉద్యమానికి అడ్డాగా ఉండేది. రాస్తారోకోలు జోరుగా సాగేవి. ఉద్యమం ఉవ్వెత్తున ఎగసిపడిన రోజుల్లో చారిత్రాత్మక మర్రి చెట్టును మాసాన్‌పల్లి చౌరస్తాలో రహదారిపెనై కూల్చి నిప్పు పెట్టడంతో రెండు రోజుల పాటు ఎక్కడి వాహనాలు అక్కడే నిలిచిపోయాయి. తెలంగాణా ఏర్పాటు చేస్తామని ప్రకటించిన తర్వాత మళ్లీ శ్రీకృష్ణ కమిటీ వేస్తామని కేంద్ర ప్రభుత్వం ప్రకటించడంతో ఆ రోజు రాత్రి మాసాన్‌పల్లి చౌరస్తా రణరంగంగా మారింది. వివిధ రాష్ట్రాలకు చెందిన లారీలను తెలంగాణా ఉద్యమకారులు ధ్వంసం చేశారు. టైర్లు కాల్చి రహదారిని దిగ్బంధించారు. మండల పరిధిలోని బీబీపేట గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్, అప్పటి టీఆర్ఎస్ మండలాధ్యక్షుడు గుండు మోహన్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున యువకులు ఆందోళనలు, నిరసనల్లో నిత్యం పాలుపంచుకున్నారు. టీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఆమరణ నిరాహార దీక్షకు పూనుకోగానే కల్హేర్‌లోని తహసీల్దార్ కార్యాలయంలోని ఫర్నీచర్‌ను ధ్వంసం చేసి, తగులబెట్టారు. కొన్ని రోజుల తర్వాత ఎంపీపీ కార్యాలయంలోని ఈజీఎస్ శాఖకు చెందిన కంప్యూటర్లు, ఫర్నీచర్‌ను ధ్వంసం చేశారు.

గుమ్మడిదల మండలంలో ఇద్దరు..



సాయికుమార్



భాస్కర్‌గౌడ్

గుమ్మడిదల: సంగారెడ్డి జిల్లా గుమ్మడిదల గ్రామానికి చెందిన ఆకుల జయరాం, జానా బాయ్ దంపతుల కుమారుడు ఆకుల సాయికుమార్(24) తెలంగాణ ఉద్యమంలో చురుకుగా పాల్గొన్నాడు. రాష్ట్ర ఏర్పాటు కాదని భావించి 2010 ఫిబ్రవరి 1న ఒంటిపై కిరోసిన్ పోసుకొని నిప్పంటించుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. గుమ్మడిదల మండలం మంబాపూర్‌కు చెందిన బాజా కృష్ణగౌడ్, లలిత దంపతుల కుమారుడు భాస్కర్‌గౌడ్(26) తెలంగాణ రాదని మనస్థాపానికి గురై రోజు 12-2-2013న మేడ్చల్ జిల్లా డబిల్‌పూర్ వద్ద రైలుకింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. ప్రత్యేక తెలంగాణ ఏర్పడిన తర్వాత రాష్ట్ర ప్రభుత్వం ఆ కుటుంబాలకు రూ.10 లక్షల చొప్పున ఆర్థిక సహాయం అందజేసి, కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించింది.

పురుగుల మందు తాగి..



సంతోష

రాయపోల్: సిద్దిపేట జిల్లా రాయపోల్‌కు చెందిన చింతకింది సంతోష రాష్ట్రం రాదేమోనన్న బెంగతో 2011 ఫిబ్రవరి 9న తెలంగాణ కోసం చనిపోతున్నానని లెటర్ రాసి పొలం వద్ద పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకుంది. ఆమె కుటుంబానికి ప్రభుత్వం రూ.10లక్షల పరిహారం ఇచ్చింది. ఆమె సోదరుడికి గురుకులంలో అటెండర్ ఉద్యోగాన్ని కల్పించింది.

దీక్ష శిబిరం నుంచి వెళ్లి..



శంకర్

నారాయణఖేడ్: తెలంగాణ ఉద్యమం ఉవ్వెత్తున కొనసాగుతున్న సమయంలో సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ మండలం సంజీవన్‌రావుపేటకుచెందిన నేముల శంకర్ దీక్ష శిబిరం నుంచి వెళ్లి ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. శంకర్‌కు భార్య లక్ష్మి, కుమారుడు, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. తెలంగాణ రాష్ట్రం సాధించిన అనంతరం ప్రభుత్వం శంకర్ కుమారుడు కిరణ్‌కు పశుసంవర్ధక శాఖలో ఉద్యోగం ఇవ్వడమే కాకుండా రూ.10 లక్షల ఆర్థిక సహాయం అందించారు.

చెరువులో దూకి..



పండరి

నారాయణఖేడ్: మండలంలోని సంజీవన్‌రావుపేటకు చెందిన సుంకె పండరి 2010లో ఆందోళన కార్యక్రమం నుంచి వెళ్లి చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. పండరికి భార్య శోభ, ఇద్దరు కుమారులు, కూతురు ఉన్నారు. ప్రత్యేక తెలంగాణలో పండరి భార్య లక్ష్మికి సాంఘిక సంక్షేమ శాఖ గురుకులంలో ఉద్యోగం ఇచ్చారు. ప్రభుత్వం రూ.10 లక్షల ఆర్థిక సహాయం చేసింది.

ఆందోళన నుంచి ఇంటికి వెళ్లి..



కనకయ్య

మద్దూరు: సిద్దిపేట జిల్లా దూళిమిట్ట మండల కేంద్రానికి చెందిన సిరబోయిన కనకయ్యది నిరుపేద కుటుంబం. 2011లో గ్రామంలో నిర్వహించిన ఆందోళనలో పాల్గొని ఇంటికి వెళ్లిన కనకయ్య ఒంటిపై కిరోసిన్ పోసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. కనకయ్య సోదరుడు రమేష్‌కు మద్దూరు మండల పరిషత్ కార్యాలయంలో అటెండర్‌గా ప్రభుత్వ ఉద్యోగం ఇచ్చారు.

ఉద్యమానికి ఊపిరి.. కొండపాక



శ్రీకాంత్

కొండపాక: తెలంగాణ ఉద్యమంలో సిద్దిపేట జిల్లా కొండపాక మండల ప్రజలు ముందు వరుసలో ఉన్నారు. మండలంలోని దుద్దెడ వద్ద రాజీవ్ రహదారిపై ఆందోళనలు ఉధృతంగా చేశారు. ఆందోళనలో భాగంగా కొండపాక నుంచి దుద్దెడ వరకు ఆగి ఉన్న సుమారు 62 బస్సుల అద్దాలు పగులకొట్టడం సంచలనం రేపింది. దుద్దెడకు చెందిన ఇద్దరు, కొండపాకకు చెందిన ఇద్దరు తెలంగాణ కోసం ఆత్మహత్యకు పాల్పడ్డారు. దుద్దెడకు చెందిన వునుగూరి శ్రీకాంత్ అనే విద్యార్థి కేసీఆర్ దీక్ష భంగం అయిందని కలత చెంది ఉద్యమానికి ఊపిరిగా నిలవాలని 2009 నవంబరు 30న చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. దుద్దెడకు చెందిన ఆవునూరి సత్తయ్య బార్బర్ షాప్ నిర్వహిస్తూ కుటుంబాన్ని పోషించేవాడు. దుద్దెడ రాజీవ్ రహదారిపై ఆందోళనలో పాల్గొని ఇంటికి వెళ్లి ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కొండపాకలో ముద్దపురం రాజయ్య, కన్యబోయిన ఐలయ్య ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఈ నాలుగు కుటుంబాల సభ్యులకు బీఆర్ఎస్ ప్రభుత్వం ఉద్యోగం ఇవ్వడంతో పాటు రూ.10 లక్షల చొప్పున ఆర్థిక సాయం అందించింది.

చేయూత కోసం సౌజన్య కుటుంబం నిరీక్షణ



చేర్యాల: తెలంగాణ కోసమే తనువు చాలిస్తున్నానని ఆస్పత్రిలో న్యాయమూర్తి ముందు మరణ వాంగ్మూలం అందించినప్పటికీ ఆ కుటుంబాన్ని ఆదుకునే వారే లేకుండా పోయారు. సిద్దిపేట జిల్లా చేర్యాల పట్టణంలోని అంబేద్కర్‌నగర్‌కాలనీకి చెందిన తాడూరు యాదయ్య-కనకతారలకు ముగ్గురు కూతుళ్లు, ఒక కుమారుడు. బీద దళిత కుటుంబానికి చెందిన యాదయ్య కూలీపనులు చేస్తూ, కనకతార పారిశుధ్య కార్మికురాలిగా పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. పెద్దకూతురు స్వప్న చాలా యేళ్లక్రితమే అనారోగ్యానికి గురై మరణించగా.. కుమారుడు రోడ్డు ప్రమాదంలో మరణించాడు. చిన్నకూతురు తాడూరు సౌజన్య(14) 2010లో 9తరగతి చదువుతుండగా, ఉవ్వెత్తున సాగుతున్న తెలంగాణ ఉద్యమానికి ఆకర్షితురాలైంది. ప్రత్యేకరాష్ట్రం వస్తుందో రాదేమోనని బెంగతో మార్చి 3, 2010న ఇంట్లో ఒంటిపై కిరోసిన్ పోసుకుని నిప్పంటించుకుంది. చికిత్స నిమిత్తం వరంగల్ ఎంజీఎంకు తరలించగా, అక్కడ పోలీసు, న్యాయమూర్తుల సమక్షంలో తెలంగాణ కోసమే ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డానని మరణ వాంగ్మూలం ఇచ్చింది. ఆ తర్వాత ఆరోగ్యం క్షీణించడంతో గంటల వ్యవధిలోనే కన్నుమూసింది. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం సిద్ధించి పదేళ్లవుతున్నా ప్రభుత్వం నుంచి ఆ కుటుంబానికి ఎలాంటి సహాయం అందలేదు. రెవెన్యూ అధికారులు, జిల్లా కలెక్టర్ కార్యాలయం నుంచి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినా సహాయం అందకపోవడంతో తల్లి కనకతార పదేళ్లుగా పడరానిపాట్లు పడుతున్నది.




ప్రజాప్రతినిధులకు ఇచ్చిన వినతిపత్రాలు చూపుతున్న తల్లి కనకతార

మండపాన్ని నిర్మించి, తెలంగాణ తల్లిని నెలకొల్పి..




దౌల్తాబాద్‌లో ఏర్పాటు చేసిన తెలంగాణ తల్లి విగ్రహం

హత్నూర: సంగారెడ్డి జిల్లా హత్నూర మండలంలోని దౌల్తాబాద్(కాసాల) చౌరస్తా మలిదశ ఉద్యమానికి ఊతమిచ్చింది. ప్రత్యేక రాష్ట్ర కాంక్షతో ఇక్కడి ప్రజలు ఉవ్వెత్తున లేచారు. దౌల్తాబాద్ చౌరస్తాలో రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా సంగారెడ్డి-నర్సాపూర్ ప్రధాన రహదారిపై అప్పటి టీఆర్ఎస్ దివ్యాంగుల విభాగం రాష్ట్ర అధ్యక్షుడు పుట్టి జనార్ధన్‌రెడ్డి సారథ్యంలో దాతలు, ఉద్యమకారుల సహకారంతో రూ.15లక్షలు వెచ్చించి ఆలయ రూపంలో మండపాన్ని నిర్మించి, అందులో తెలంగాణ తల్లిని నెలకొల్పి ప్రత్యేక రాష్ట్ర కాంక్షను చాటారు. తెలంగాణ తల్లి విగ్రహాన్ని 15 సెప్టెంబరు 2010న ఉద్యమ నాయకుడు కేసీఆర్ ఆవిష్కరించారు. పల్పనూర్ గ్రామానికి చెందిన డప్పు గోపాల్, ఎండీ సలీం, దేవులపల్లి గ్రామానికి చెందిన పుట్టి ఇంద్రశేఖర్‌రెడ్డి, కొన్యాల గ్రామానికి చెందిన భట్టు మారుతి రాజు, చెన్న నర్సింలు తెలంగాణ తల్లి మండపం నీడలో కూర్చొని ఆమరణ నిరాహార దీక్షకు దిగారు. నాలుగురోజులైనా అప్పటి ప్రభుత్వం దిగిరాకపోవడం, వారీ ఆరోగ్య పరిస్థితి క్షీణిస్తూ ఉండడంతో విషయం తెలుసుకున్న ఉద్యమ నాయకుడు కేసీఆర్ దౌల్తాబాద్‌కు చేరుకొని వారికి నచ్చచెప్పి నిమ్మరసం ఇచ్చి దీక్షను విరమింపజేశారు. ఇదిలా ఉండగా డప్పు గోపాల్‌ది నిరుపేద కుటుంబం. తాపీ మేస్త్రీగా పని చేస్తూ ఇటీవల అనారోగ్యానికి గురై మంచం పట్టాడు. ఉన్న పూరి గుడిసె కూలిపోవడంతో అద్దె ఇంటిలో ఉంటూ ఆపన్న హస్తం కోసం ఎదురు చూస్తున్నాడు. భట్టు మారుతిరాజుపై అప్పట్లో పెట్టిన పోలీసు కేసులతో అనేక అవస్థలు పడుతున్నాడు. ఉద్యమానికి ముందులాగానే ఆటో నడుపుతూ జీవనం గడుపుతున్నాడు. చెన్న నర్సింలు ఎంపీటీసీగా గెలుపొంది, ఎంపీపీ ఉపాధ్యక్షుడిగా పని చేశాడు.







ఆమరణ నిరాహార దీక్షలో పాల్గొన్న గోపాల్, మారుతిరాజు, చెన్న నర్సింలు

భక్తాంజనేయస్వామి దయతో ప్రజలు సుభిక్షంగా ఉండాలి

● జడ్పీ చైర్‌పర్సన్ రోజాశర్మ

చిన్నకోడూరు, జూన్ 1: భక్తాంజనేయస్వామి దయతో ప్రజలందరూ సుఖసంతోషాలతో సుభిక్షంగా ఉండాలని జడ్పీ చైర్‌పర్సన్ రోజాశర్మ ఆకాంక్షించారు. హనుమాన్ జయంతిని పురస్కరించుకుని శనివారం మండలంలోని చంద్లాపూర్‌లోని భక్తాంజనేయస్వామి ఆలయంలో నిర్వహించిన వేడుకల్లో ఆమె ప్రత్యేక పూజలు చేసి మాట్లాడారు. సుమారు 4 శతాబ్దాల చరిత్ర కలిగిన భక్తాంజనేయ స్వామి ఆలయంలో ప్రతి యేటా జయంతి వేడుకలు ఘనంగా నిర్వహిస్తున్నట్లు ఆమె తెలిపారు. హనుమాన్ మాలధారణ స్వాములు దీక్ష విరమణ చేశారు. అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అదేవిధంగా చిన్నకోడూరు గ్రామ శివారులోని శేరిపల్లి వీరాంజనేయ స్వామి ఆలయంలో తెల్లవారుజాము నుంచే స్వామి వారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. హనుమాన్ మాలధారణ స్వాములు హోమం చేసి మాల విరమణ చేశారు.

● వర్గల్: మండల కేంద్రంలో హనుమాన్ జయంతిని అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని అభయాంజనేయ స్వామి ఆలయం వద్ద వేద పండితులు ప్రవీణ్ శర్మ ఆధ్వర్యంలో హోమంతో పాటు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. పూజల అనంతరం హనుమాన్ స్వాములు కొండగట్టుకు బయలు దేరారు. కార్యక్రమంలో హనుమాన్ భక్త బృందంతో పాటు గ్రామస్థులు పాల్గొన్నారు.

● కొండపాక: హనుమాన్ జయంతిని మండలంలో ఘనంగా నిర్వహించారు. మండలంలోని దుద్దెడలోని ఆదిపెరమాండ్ల హనుమాన్ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మర్పడగ, సిరసనగండ్ల, ఆరేపల్లి, రవీంద్రనగర్ తదితర గ్రామాల్లోని హనుమాన్ ఆలయాల్లో ప్రత్యేక పూజలు జరిపారు. హనుమాన్‌స్వాములు దీక్ష విరమణ చేశారు.

● గజ్వేల్: గజ్వేల్ పట్టణంతో పాటు డివిజన్ వ్యాప్తంగా హనుమాన్ జయంతి మహోత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. పట్టణంలోని పాండవుల చెరువుపై గల శ్రీ కార్యసిద్ధి ఆంజనేయస్వామి ఆలయంలో జయంతి మహోత్సవాల్లో ప్రత్యేక పూజా కార్యక్రమాలను సాయికృష్ణశర్మ ఆధ్వర్యంలో చాడ నందబాల శర్మ పర్యవేక్షణలో నిర్వహించారు. అంగడిపేట హనుమాన్ ఆలయం వద్ద భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. కార్యక్రమాలలో మునిసిపల్ చైర్మన్ ఎన్‌సీ రాజమౌళి, మునిసిపల్ మాజీ చైర్మన్ గాడిపల్లి భాస్కర్, కౌన్సిలర్లు బొగ్గుల చందు, ఉప్పల మెట్టయ్య, కోఆప్షన్ సభ్యుడు గంగిశెట్టి రాజు, రామచంద్రాచారి, నాయకులు బాల్‌కుమార్ సుంకరి, శ్రీధర్, రవిందర్, బిక్షపతి, దుర్గాప్రసాద్, నాగరాజు నేత, చల్లా శ్రీనివాస్‌రెడ్డి, ప్రేమ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.


చిన్నకోడూరు: భక్తాంజనేయస్వామి ఆలయంలో హోమం చేస్తున్న జడ్పీ చైర్‌పర్సన్ దంపతులు


వర్గల్: అభయాంజనేయస్వామి ఆలయంలో హోమం నిర్వహిస్తున్న హనుమాన్ మాలధారులు

● బెజ్జంకి: మండలంలోని ఆయా గ్రామాల్లో హనుమాన్ జయంతి వేడుకలను హనుమాన్ దీక్ష పరులు, భక్తులు భక్తిశ్రద్ధలతో ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేసి జరుపుకున్నారు. గాగిల్లాపూర్ గ్రామంలో ఆంజనేయ స్వామి విగ్రహానికి పంచామృతాభిషేకం నిర్వహించి అష్టోత్తర నామావళి పూజ చేశారు. మండల కేంద్రంలో హనుమాన్ జయంతిని పురస్కరించుకుని హనుమాన్ భక్త మండలి ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు.

● దౌల్తాబాద్: మండల పరిధిలోని మాచిన్‌పల్లిలో హన్‌మాన్ జయంతిని పురస్కరించుకుని హన్‌మాన్ ఆలయ చైర్మన్ మోటాడు గిరీష్‌రెడ్డి దంపతులు హన్‌మాన్ ఆలయంలో చాలీసా యాగం నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామ ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

● దుబ్బాక/మిరుదొడ్డి: దుబ్బాక, మిరుదొడ్డి మండలాల్లో వివిధ గ్రామాల్లోని ఆంజనేయస్వామి ఆలయాల్లో హనుమాన్ మాలధారులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. దుబ్బాక ఆంజనేయస్వామి ఆలయంలో ఎస్‌ఐ గంగరాజు ప్రత్యేక పూజలు చేశారు.

● చేర్యాల: హనుమాన్ జయంతి వేడుకలను చేర్యాల, కొమురవెల్లి మండలాల ప్రజలు అత్యంత భక్తి ప్రపత్తులతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాలలోని ఆలయాల్లో హనుమంతుడికి చందనాభిషేకం, భిక్ష, పుష్పార్చన హనుమాన్ మాలాధారణ స్వాములు విరమణ చేశారు.

● హుస్నాబాద్: హుస్నాబాద్ పట్టణంలోని శివాజీ నగర్ శ్రీదాస ఆంజనేయస్వామి దేవాలయంలో శనివారం హనుమాన్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఇందులో చందనాభిషేకం, నాగవల్లి దళార్చన, అష్టోత్తర పూర్వక వడమాల పూజ, లక్ష్మీగణపతి పూజ, హనుమాన్ చాలిసా పారాయణం, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఆకుల రజిత, వెంకన్న దంపతులు హోమం నిర్వహించారు. ఇందులో కౌన్సిలర్లు వాల సుప్రజ, అయిలేని శంకర్‌రెడ్డి, పచ్చిమట్ల రవీందర్‌గౌడ్, కొమురవెల్లి రవీందర్‌గౌడ్, మాధవరెడ్డి, సత్యనారాయణరెడ్డి, పూజారి పవన్ శర్మ పాల్గొన్నారు.


ములుగు: హనుమాన్ ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న రేణుక చౌదరి, కుటుంబసభ్యులు


చేర్యాల: రామలింగేశ్వర ఆలయంలో ఆంజనేయుడికి పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

హనుమాన్ జయంతిని పురస్కరించుకుని ఖర్బుజ కాయపై హనుమంతుడి చిత్రాన్ని శ్రీరామకోటి భక్త సమాజం అధ్యక్షుడు రామరాజు ఆవిష్కరించారు. - గజ్వేల్



కూతురిపై కన్నేసిన ప్రియుడి హత్య

గజ్వేల్, జూన్ 1 : ఓ మహిళ యువకుడితో వివాహేతర సంబంధం నెరిపింది. అయితే, ప్రియుడు తల్లితో పాటు తన కూతురిపై కన్నేశాడు. ఇది గమనించిన ఆ మహిళలో తల్లి ప్రేమ బయటకు వచ్చింది. ప్రియుడిని హెచ్చరించింది. తన కూతురికి అతడితో ఎప్పటికైనా ప్రమాదమని భావించిన మహిళ తన కుమారుడితో కలిసి ప్రియుడిని హతమార్చింది. మే 30న, గురువారం రాత్రి సిద్దిపేట జిల్లా గజ్వేల్ మండలం అహ్మదీపూర్ గ్రామంలో జరిగిన ఈ హత్య కేసును పోలీసులు ఛేదించారు. నిందితులను విచారించి, రిమాండ్‌కు తరలించినట్లు గజ్వేల్ ఏసీపీ కె.పురుషోత్తంరెడ్డి, ఇన్‌స్పెక్టర్ బి.సైదా తెలిపారు. ఏసీపీ కేసు వివరాలను వెల్లడించారు. గజ్వేల్ మండలం అహ్మదీపూర్ గ్రామానికి చెందిన మాదోజీ నరేశ్(28) ఈ నెల 30న సాయంత్రం 4 గంటల సమయంలో గ్రామంలోని ఓ మహిళ ఇంటికి వెళ్లి తిరిగిరాలేదు. ఈ క్రమంలో నరేశ్ తల్లి మాదోజీ కలమ్మకు అనుమానం వచ్చి ఫోన్‌చేయగా, కనెక్ట్ కాలేదు. దీంతో ఆమె ఇంట్లోకి వెళ్లి చూడగా, షటర్‌లో కింద పడి చనిపోయి ఉన్నాడు. మాదోజీ కలమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు గజ్వేల్ సీఐ సైదా కేసు నమోదు చేసుకుని విచారణ ప్రారంభించారు. ఈ క్రమంలో అనుమానాస్పద వ్యక్తులు ఇద్దరిని అదుపులోకి తీసుకుని విచారించారు. ఈ విచారణలో వారు నేరం ఒప్పుకున్నారని, మాదోజీ నరేష్ గత కొంత కాలంగా గ్రామానికి చెందిన ఓ మహిళతో వివాహేతర సంబంధాన్ని ఏర్పర్చుకున్నారని తెలిపారు. ఈ క్రమంలో సదరు మహిళ కూతురిపై నరేశ్ కన్నేయడాన్ని గుర్తించి, పలుమార్లు అతడిని హెచ్చరించింది. తన కూతురికి ఎప్పుడైనా నరేశ్‌తో ప్రమాదమని భావించిన ఆమె అతడి పీడను వదిలించుకోవాలని భావించింది. మే 30న నరేశ్ తన ఇంట్లోకి రాగా కుమారుడి(21)తో కలసి గొంతునొక్కి చంపారు. చనిపోయిన అనంతరం ఉరివేసి, ఉరి నుంచి కింద పడుకోబెట్టారని తెలిపారు. ఈ విషయంలో నేరం ఒప్పుకున్న తల్లి కొడుకును సీఐ సైదా అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారని గజ్వేల్ ఏసీపీ పురుషోత్తంరెడ్డి తెలిపారు.

వడదెబ్బతో హమాలీ కార్మికుడి మృతి


సంపత్(ఫైల్

హుస్నాబాద్, జూన్ 1 : వడదెబ్బతో హమాలీ కార్మికుడు మృతిచెందిన సంఘటన సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ పట్టణంలో శుక్రవారం రాత్రి చోటుచేసుకున్నది. కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని హనుమాన్‌నగర్‌కు చెందిన ఉల్లెంగుల సంపత్ (42) అంబేడ్కర్ హమాలీ సంఘంలో పని చేస్తున్నాడు. సంపత్ గురువారం ఎప్పటిలాగే హమాలీ పని చేస్తుండగా ఎండ దెబ్బ తగిలి తీవ్ర అస్వస్థకు గురయ్యాడు. వెంటనే పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలుపడంతో కరీంనగర్‌లోని ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు కుటుంబసభ్యులు చెప్పారు. సంపత్‌కు భార్య, కూతురు, కుమారుడు ఉన్నారు. నిరుపేద అయిన సంపత్ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని అంబేడ్కర్ హమాలీ సంఘం అధ్యక్షులు పున్న రాజమౌళి కోరారు.

చికెన్ తినవద్దు అన్నందుకు వ్యక్తి ఆత్మహత్య

బెజ్జంకి, జూన్ 1: చికెన్ వద్దు అన్నందుకు పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని పోతారం గ్రామ శివారులోని కోళ్లఫారం శనివారం చోటుచేసుకున్నది. ఆదిలాబాద్‌కు చెందిన దశరథ్ (40) అనే వ్యక్తి భార్య సంగోలి, ముగ్గురు పిల్లలతో కలిసి మూడు సంవత్సరాల క్రితం పోతారం గ్రామ శివారులోని కోళ్లఫామ్‌లో పనిచేసేందుకు వచ్చాడు. అతడి ఆరోగ్యం బాగా లేకపోవడంతో భార్య రెండు రోజుల క్రితం దశరథ్‌ను ఆస్పత్రికి తీసుకెళ్లి చికిత్స చేయించుకుని ఇంటికి తీసుకొచ్చింది. దశరథ్ చికెన్ వండమని భార్యతో గొడవపడ్డాడు. డాక్టర్ చికెన్ తినవద్దని చెప్పాడని భార్య చెప్పడంతో గొడవ పెరిగి మనస్తాపంతో పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబసభ్యులు కరీంనగర్‌లోని ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ కృష్ణారెడ్డి తెలిపారు.

ఉరేసుకుని మహిళ..

రాయపోల్, జూన్ 1: ఉరేసుకుని ఓ మహిళ ఆత్మహత్య చేసుకున్న సంఘటన రాయపోల్ మండలం కొత్తపల్లిలో శనివారం చోటుచేసుకున్నది. గ్రామానికి చెందిన పంగ నర్సమ్మ కుమార్తె మహేశ్వరి(38)ని 20 సంవత్సరాల క్రితం తొగుటకు చెందిన లక్ష్మణ్‌కు ఇచ్చి వివాహం చేశారు. ఆయనతో విడిపోయిన ఆమె హైదరాబాద్‌కు చెందిన సంతోష్‌కుమార్‌ను వివాహం చేసుకోగా ఓ కుమారుడు జన్మించాడు. అనంతరం అతడినీ వదిలేసి కుమారుడితో పాటు కొత్తపల్లికి వచ్చి ఉంటున్నది. ఆమె కొంతకాలంగా ఫిట్స్‌తో బాధపడుతున్నది. ఈ క్రమంలో కల్లుకు బానిసైంది. తన కుమారుడి భవిష్యత్తు గురించి ఆలోచిస్తూ, జీవితంపై విరక్తి చెంది శుక్రవారం రాత్రి ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. మృతురాలి తల్లి నర్సమ్మ ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రఘుపతి తెలిపారు.

జీవితంపై విరక్తితో ఒకరు..

సిద్దిపేట క్రైం, జూన్ 1: జీవితంపై విరక్తిచెంది వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన సిద్దిపేట పట్టణంలో శనివారం చోటుచేసుకున్నది. బెజ్జంకికి చెందిన కాటా కాస్పరాజ్(58) 15 సంవత్సరాల నుంచి తన కుటుంబానికి దూరంగా ఉంటూ, సిద్దిపేటలో కూలీ పని చేసుకుంటూ జీవిస్తున్నాడు. ఈ క్రమంలో జీవితం మీద విరక్తి చెంది శనివారం ఉదయం సిద్దిపేట పాత బస్టాండ్ సమీపంలోని అంబేడ్కర్ సర్కిల్లో మెట్ల స్టాండుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

రైస్‌మిల్లులో అగ్నిప్రమాదం

సిద్దిపేట క్రైం, జూన్ 1: సిద్దిపేట పట్టణ శివారులోని నర్సాపూర్ చౌరస్తా వద్ద ఉన్న శ్రీ రాజరాజేశ్వరి రైస్ మిల్లులోని గోనే సంచుల గదిలో శనివారం ఉదయం విద్యుదాఘాతంతో మంటలు చెలరేగాయి, ఫైర్ స్టేషన్‌కు సమాచారం అందించడంతో వారు సంఘటన స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తెచ్చారు. ఈ అగ్ని ప్రమాదంలో 30 వేల గోనెసంచులు కాలి బూడిద అయ్యాయి.


అగ్ని ప్రమాదంలో కాలిపోయిన గోనె సంచులు

ఉద్యమ ఆకాంక్షలను నెరవేర్చాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది

● సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న చాడ వెంకటరెడ్డి

హుస్నాబాద్, జూన్ 1 : తెలంగాణ ఉద్యమ ఆకాంక్షలను నెరవేర్చాల్సిన బాధ్యత రేవంత్‌రెడ్డి ప్రభుత్వంపై ఉందని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి అన్నారు. శనివారం హుస్నాబాద్ పట్టణంలోని అనభేరి, సింగిరెడ్డి అమరుల భవనంలో అయన విలేకరులతో మాట్లాడారు. ఏ ఆకాంక్షల కోసమైతే తెలంగాణ ఉద్యమం జరిగిందో దానిని 10 సంవత్సరాలు అధికారంలో ఉన్న బీఆర్‌ఎస్ ప్రభుత్వం విస్మరించిందన్నారు. ప్రజల ఆకాంక్షలు నెరవేర్చకుండా విపరీతమైన అవినీతి జరిగిందని, ఫోన్ ట్యాపింగ్‌తో వేల కోట్లు సంపాదించారని, ఇది తెలంగాణ రాష్ట్రానికి మాయని మచ్చని ఆరోపించారు. పరాకాష్టకు చేరిన అవినీతికి ఈ ప్రభుత్వం కళ్లెం వేసి, అవినీతి రహిత ప్రభుత్వంగా పేరొందాలన్నారు. రాజకీయ ప్రయోజనాలను ఆశించకుండా సోనియా గాంధీ పట్టుదలతో తెలంగాణ ఏర్పడిందన్నారు. తెలంగాణ సాయుధ పోరాటం లేకపోతే తెలంగాణ లేదన్నారు. సాయుధ పోరాటయోధులను మరువద్దన్నారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాలను ఘనంగా నిర్వహించడం అభినందనీయమన్నారు. రాష్ట్ర గీతం తెలంగాణ సంస్కృతి, ఉద్యమ చరిత్రకు అద్దం పట్టే పరిస్థితి ఉందన్నారు. అందరి అభిప్రాయాలను పరిగణలో తీసుకొని రాష్ట్ర చిహ్నంపై నిర్ణయం తీసుకుంటామని సీఎం రేవంత్‌రెడ్డి చెప్పారని వెల్లడించారు. ఈ సమావేశంలో సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు గడిపె మల్లేశ్, బోయిని అశోక్, నాయకులు సంజీవరెడ్డి, రాజ్‌కుమార్, కుమారస్వామి తదితరులున్నారు.

పునఃప్రారంభం నాటికి పనులు పూర్తి చేయాలి

● డీఆర్డీవో పీడీ జయదేవ్ ఆర్య

జగదేవ్‌పూర్, జూన్ 1: పాఠశాలల పునఃప్రారంభానికి ముందే ఏకరూప దుస్తుల పనులను పూర్తి చేయాలని డీఆర్డీవో పీడీ జయదేవ్ ఆర్య సూచించారు. మండలంలోని తిగుల్, పలుగుగడ్డ, మాందాపూర్ గ్రామాల్లో మహిళ సంఘాల ఆధ్వర్యంలో కొనసాగుతున్న దుస్తుల కుట్టు పనులను శనివారం పరిశీలించారు. అలాగే చాట్లపల్లిలో అమ్మ ఆదర్శ పాఠశాల పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల దుస్తులు కుట్టే పనులను మహిళల సంఘాలకు అప్పగించామని, పాఠశాలలు పునః ప్రారంభానికి సమయం తక్కువ ఉన్నందున కుట్టు పనులను మూడో తేదీ వరకు పూర్తి చేయాలని కోరారు. ఉపాధిహామీ పనుల్లో కూలీల సంఖ్య పెంచాలని, పెండింగ్ వేతనాలు త్వరలోనే వారి అకౌంట్‌లో జమవుతాయని అన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో యాదగిరి, ఎంపీవో శ్రీనివాస్‌వర్మ, వివిధ శాఖల అధికారులు శ్రీనివాస్‌రెడ్డి, దేవయ్య శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఎన్‌సీసీ శిక్షణా శిబిరం ప్రారంభం

గజ్వేల్, జూన్ 1: గజ్వేల్ పట్టణంలోని డిగ్రీ కళాశాలలో సంగారెడ్డి బెటాలియన్ ఆధ్వర్యంలో ఎన్‌సీసీ సంయుక్త శిక్షణా శిబిరం ప్రారంభమైనట్లు కమాండింగ్ అధికారి లెఫ్టినెంట్ కల్నల్ పీఎస్ నందా, అడ్మినిస్ట్రేటివ్ అధికారి మధుసూదన్‌రావు తెలిపారు. జూన్ 1 నుంచి పదో తారీఖు వరకు ఈ శిక్షణ శిబిరం కొనసాగుతుందని, మెదక్, సంగారెడ్డి, సిద్దిపేట, నిజామాబాద్, అదిలాబాద్, కరీంనగర్ జిల్లాల నుంచి 600మంది కెడెట్లు హాజరుకానున్నారని తెలిపారు. ఈ శిబిరంలో యోగా, కవాతు, ఫైరింగ్, మ్యాప్ రీడింగ్, వ్యక్తిత్వ వికాస తరగతులు, క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాల్లో ఇరవై మంది శిక్షణ అధికారులు, పది మంది ఎన్‌సీసీ అధికారులు శిక్షణ ఇస్తారని గజ్వేల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్‌సీసీ అధికారి కెప్టెన్ భవాని తెలిపారు.

భూమి కబ్జా చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

● కాంగ్రెస్ నాయకుల వినతి

సిద్దిపేట అర్బన్, జూన్ 1: సిద్దిపేటలోని హౌసింగ్ బోర్డు కాలనీ, సిద్దిపేట అర్బన్ మండలం మిట్టపల్లి సమీపంలో ఉన్న ప్రభుత్వ భూమిని కబ్జా చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని ఆరోపిస్తూ, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు అత్తు ఇమామ్ ఆధ్వర్యంలో శనివారం సిద్దిపేట తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్ రాజేష్‌కు కాంగ్రెస్ నాయకులు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా అత్తు ఇమామ్ మాట్లాడుతూ.. పదేళ్లపాటు పాలించిన బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో సిద్దిపేట పట్టణంలో హౌసింగ్‌బోర్డు కాలనీకి చెందిన సర్వేనెంబర్ 1340, 1301, 1368లలో స్థలం కబ్జాకు గురైందని ఆరోపించారు. అదేవిధంగా మిట్టపల్లిలోని సర్వే నెంబర్లు 967, 19, 315./1 నుంచి 315/9 వరకు, 333. 312/1, 321/డీఈలలో ప్రభుత్వ భూమిని కబ్జా చేసి, రెగ్యులరైజేషన్ జీవో కింద దరఖాస్తు చేసుకున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో పట్టణ ప్రధాన కార్యదర్శి గ్యాదరి మధు, పట్టణ యువజన అధ్యక్షుడు గయాజుద్దీన్, బొమ్మల ప్రవీణ్, సంతోష్ గౌడ్, మనోజ్, శేఖర్, రాకేశ్ తదితరులు పాల్గొన్నారు.


సిద్దిపేటఅర్బన్: వినతిపత్రం సమర్పిస్తున్న నాయకులు

● బెజ్జంకి: ప్రభుత్వ భూమిని కబ్జా చేసి, వెంచర్ చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం పక్కన ఉన్న సర్వే నెంబర్ 643లో 15 ఎకరాల పైచిలుకు భూమి ఉందని, పక్క సర్వే నెంబర్ల వారు వెంచర్ వేసి ప్రభుత్వ భూమిని కబ్జా చేశారన్నారు. అట్టి సర్వే నెంబర్ భూమిని రెవెన్యూ అధికారులు సర్వే చేసి హద్దులు ఏర్పాటు చేసి ప్రభుత్వ భూమిని కాపాడాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు సంగెం మధు, మహేష్, శ్రవణ్, బాలమల్లు, చరణ్ పాల్గొన్నారు.


ఉద్యాన విశ్వవిద్యాలయం, ఎన్ఐఓఎన్ మధ్య ఒప్పందం


ఒప్పంద పత్రాలను చూపుతున్న అధికారులు

ములుగు, జూన్ 1: శ్రీకొండా లక్ష్మణ్ రాష్ట్ర ఉద్యాన విశ్వవిద్యాలయం, హైదరాబాద్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ న్యూట్రిషన్‌ల మధ్య ఒప్పందం కుదిరింది. మండల కేంద్రమైన ములుగు అర్టికల్చర్ యూనివర్సిటీ వైస్‌చాన్స్‌లర్ నీరజ ప్రభాకర్, నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ న్యూట్రిషన్ శాస్త్రవేత్తలు వెంకటేష్, సిల్వియా ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు. ఈ సందర్భంగా వీసీ నీరజ ప్రభాకర్ మాట్లాడుతూ.. ఈ ఒప్పందం ప్రధాన ఉద్దేశం క్లిష్టమైన ఆరోగ్య సమస్యలను పరిష్కరించుకోవడంలో స్థిరమైన ఉద్యాన పద్ధతులను పోత్సహించడం కోసమని చెప్పారు. కార్యక్రమంలో రిజిస్టర్ అధికారి భగవాన్, రాజశేఖర్, విజయ, శ్రీనివాస్, సుచిత్రతో పాటు తదితరులు పాల్గొన్నారు.

వంగపల్లిలో చాళుక్యుల నాటి వీరగల్లు

మద్దూరు, జూన్ 1 : సిద్దిపేట జిల్లా మద్దూరు మండలంలోని వంగపల్లిలో చాళుక్యు కాలం నాటి వీరగల్లును పరిశోధకుడు రత్నాకర్‌రెడ్డి గుర్తించారు. గ్రామంలోని బురుజు వద్ద వీరగల్లు శిల్పాన్ని గుర్తించారు. వేట కుక్కల సాయంతో అడవి పందుల నుంచి పంటను కాపాడుకునే ప్రయత్నంలో ప్రాణాలు పోగొట్టుకున్న వంగపల్లికి చెందిన వీర సైనికుడిదిగా చెప్పారు. నల్లటి గ్రానైట్ శిలపై రెండు దళాలుగా శిల్పం ఉందన్నారు. పైన ఒక చేత్తో కత్తి, మరో చేత్తో కళ్లాన్ని పట్టుకుని గుర్రాన్ని పరుగు తీయిస్తున్న సైనికుడు ఉండగా, ముందు వెనకాల అడవి పందిని వేటాడుతున్న కుక్కలు ఉన్నాయన్నారు. ఈ శాసనంలో మల్లిరెడ్డిని ప్రకాశిత కీర్తి సమన్వితుడు, సద్విమల గుణాభిరాముడు, పవిత్ర చరిత్రుడు, సన్మార్గమున నడచి సమృద్ధి బాంధవులను చూసుకునేవాడు, పరమధర్మ పాలన చేసినట్లుగా పేర్కొనబడినట్లు ఉందని తెలిపారు. చరిత్రను పాలకుల బాధ్యతను గుర్తు చేసే వీరుగల్లును గ్రామస్థులు కాపాడుకోవాలని పరిశోధకుడు కోరారు.


మద్దూరులోని వంగపల్లిలో లభ్యమైన వీరగల్లు శిల్పం

పాఠశాలల్లోని పనుల పరిశీలన

చేర్యాల, జూన్ 1 : చేర్యాల మండలం ఆకునూరు జడ్పీఎస్‌ఎస్ స్కూల్ కాంప్లెక్స్ పరిధిలోని తాడూరు, చిట్యాల, దానంపల్లి, కమలాయపల్లి, అర్జున్‌పట్ల, ఆకునూరు పాఠశాలల్లో అమ్మ ఆదర్శపాఠశాల కమిటీ ఆధ్వర్యంలో జరుగుతున్న పనులను శనివారం సిద్దిపేట డీఈవో శ్రీనివాస్‌రెడ్డి పరిశీలించారు. ఆయన వెంట ఇన్‌చార్జి ఎంఈవో పి.శ్రీనివాస్‌రెడ్డి, సీఆర్పీ కనకరాజు తదితరులున్నారు.

● నంగునూరు: ఈ నెల 3 నుంచి 19 వరకు జరిగే బడిబాట కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని నంగునూరు మండల ఇన్‌చార్జి విద్యాధికారి సత్తు యాదవరెడ్డి కోరారు. ఎంపీపీ కార్యాలయంలో ఎంపీడీవో మాట్ల వేణుగోపాల్ అధ్యక్షతన మండల పరిధిలోని వివిధ ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్‌పర్సన్‌లకు శనివారం సమావేశం నిర్వహించారు, ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బడి ఈడు పిల్లలను బడిలో చేర్పించే విధంగా ప్రతి ఉపాధ్యాయుడు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ అనిల్‌కుమార్, మండల విద్యానోడల్ అధికారి ప్రభాకర్ రావు, ఇన్‌చార్జి ఏపీఎం పంగ లింగం, రాజగోపాల్‌పేట ఏఎస్‌ఐ శ్రీనివాస్ గౌడ్, ప్రధానోపాధ్యాయులు రామస్వామిగౌడ్, కనకయ్య, నాగార్జునరెడ్డి అమ్మ అదర్శ కమిటీ సభ్యులు, అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఉచిత విద్య, వైద్యం అందించడం స్ఫూర్తిదాయకం

● సృజన మహిళా స్వచ్ఛంద సంస్థ గౌరవ సలహాదారు రషీదా

కొండపాక, జూన్ 1 : నిరుపేద కుటుంబాలకు అండగా నిలుస్తూ ఉచితంగా విద్య, వైద్యం అందిస్తున్న సద్గురు మధుసూదన సాయి సేవలు స్ఫూర్తిదాయకమని ప్రముఖ న్యాయవాది, అభయ, సృజన మహిళా స్వచ్ఛంద సంస్థ గౌరవ సలహాదారు రషీదా అన్నారు. కొండపాక శివారులోని శ్రీసత్య సాయి ప్రశాంతినికేతనంలో శనివారం నిర్వహించిన మహిళా కళాశాల ఆరో వార్షికోత్సవ వేడుకలలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ముందుగా ఆమె సంగీత, నృత్య మందిరాన్ని ప్రారంభించారు. కళాశాలలో ఉత్తమ సేవలు అందించిన ఉపాధ్యాయులను సత్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సద్గురు మధుసూదన సాయి సనాతన విలువలను కాపాడుతూ, విలువలతో కూడిన విద్యను అందిస్తూ భావితరాలకు స్ఫూర్తి ప్రదాతగా నిలిచారని అన్నారు. ఆడపిల్లల కోసం కొండపాకలో ఐదేళ్ల క్రితం మహిళా జూనియర్ కళాశాలను స్థాపించగా, నేడు యూనివర్సిటీ స్థాయికి ఎదగడం గొప్ప విషయమన్నారు. అతిథులుగా విచ్చేసిన రషీదా, ఆనంద నిలయం వయోవృద్ధాశ్రమం, అనాధ ఆశ్రమం ఇన్‌చార్జి అరుణాదేవి, సీఎస్‌ఆర్ ఇన్‌చార్జి రాధిక శ్రీదర్‌లను కళాశాల చైర్‌పర్సన్ పూర్ణిమ శంకర్, కార్యదర్శి శంకర్ సత్కరించారు. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి. ఈ కార్యక్రమంలో ఏకడమిక్ కోఆర్డినేటర్ సునయన, డిప్యూటీ చైర్‌పర్సన్ రేష్మకుందన్, జయశ్రీ, మానసలతోపాటు కళాశాల సిబ్బంది, విద్యార్థినులు పాల్గొన్నారు


సాంస్కృతిక ప్రదర్శన చేస్తున్న విద్యార్థులు